క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల పట్టివేత

పలువురికి జరిమానాలు



నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రధాన మార్గంలోని పలు వాణిజ్య దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను సోమవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకుని ఆయా షాపుల యజమానులకు జరిమానాలు విధించారు. కేరళ బేకరీ,జ్యూస్ షాప్,తోపుడు బళ్ల వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నారని తెలుసుకుని దాడి చేశామన్నారు. నిషేధిత పాలిథిన్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు.ఇలాంటి వారిపై ఇక మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

మల్కాపురం: ఆటో యజమానిపై దాడి చేసి దాడి చేసిన వ్యక్తిని మల్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు .. జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుడుల సెంటర్ వద్ద త్రిమూర్తులు అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇతనికి చూపు మందగించడంతో తన ఆటోను అదే ప్రాంతానికి చెందిన చీపురుపల్లి నరేష్ అనే వ్యక్తికి రోజువారి అద్దెకు ఇచ్చాడు.ఈ క్రమంలో గత నెల 24న నరేష్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు కావడంతో ఆటోను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న యజమాని త్రిమూర్తులు తన ఆటోను స్టేషన్ నుంచి విడిపించి ఇవ్వాలని నరేష్‌ను కోరాడు. ఈ అంశంపై ఇరువురి మధ్య గత నెల 27న వాదన జరిగింది.దీంతో సహనం కోల్పోయిన నరేష్ త్రిమూర్తులు పై దాడి చేసి గాయపరిచాడు. త్రిమూర్తులు మల్కాపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు నరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రంగారావుకు నివాళులు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు లంకా రంగారావు ఆశవానిపాలెంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన పార్థివ దేహానికి వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, డీకే ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్, వైఎస్సార్‌సీపీ 56,57 వార్డుల అధ్యక్షులు ఆదారి శ్రీనివాసరావు, పిన్నింటి అప్పలరావు, పార్టీ నాయకులు దొడ్డి సతీష్, కొడ ధనరాజ్, చెంగల ఈశ్వరరావు, పట్నాయక్, చెంగల సూరిబాబు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు డీకే ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్ మృతిడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేశారు. సీనియర్ నాయకుడు లంకా రంగారావు మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు నాయకులు పేర్కొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మ వారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద ఆకు కూరల వ్యాపారం



రిటైల్ అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఆకు కూరలు

ఆకుకూరలు C/o గోపాలపట్నం

- వేకువ జామున 2 నుంచి ఉదయం 6 గంటల వరకు వ్యాపారం
- రోజుకు సుమారు రూ.4 లక్షలకు పైగా లావాదేవీలు

చిన్న ప్రాంతం... పెద్ద వ్యాపారం..
అవును మీరు చదువుతున్నది నిజమే..

గోపాలపట్నం బంక్ ప్రాంతం ఆకు కూరల **హోల్‌సేల్** వ్యాపారానికి కేంద్రంగా మారింది. గోపాలపట్నం, పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి రైతులు **ఆకు కూరలను** వేకువజామున 2 గంటల ప్రాంతంలో **ఆటోల్లో తీసుకు** వచ్చి అమ్మకాలు చేసి తిరిగి ఉదయం **6 గంటలకు వెళ్లి** పోతుంటారు. నాణ్యమైన, తాజా ఆకు **కూరలు బంక్** సెంటర్‌లో దొరుకుతాయనే నమ్మకంతో **చాలా మంది** వ్యాపారస్తులు ఇక్కడ కొనుగోలు చేసి **తీసుకు వెళ్లారు**

– గోపాలపట్నం

ఇక్కడి నుంచే గాజువాక, జ్ఞానాపురం, పూర్ణామార్కెట్‌కు తరలింపు

నగరం చుట్టు పక్కల ప్రాంతాలైన చింతలగ్రహారం, పొర్లుపాలెం, చీమలాపల్లి, కొంత్యాం, ఏనుగులపాలెం, ముచ్చర్ల వంటి పలు పల్లెల నుంచి రైతులు ఆకుకూరలను ఇక్కడికి తీసుకు వస్తారు. ఇక్కడి రిటైల్ వ్యాపారస్తులే కాకుండా ఎక్కువ మొత్తంలో ఆకు కూరలు కావాల్సిన వారు వచ్చి కొనుగోలు చేసి తీసుకు పోతుంటారు. అంతా నిద్రలో ఉన్న సమయంలో బంక్ సెంటర్ మాత్రం రద్దీగా ఉంటుంది. సూరీడు పూర్తిగా రాక ముందే ఈ లావాదేవీలు పూర్తవుతాయంటే అతిశయోక్తి కాదు.



చివరి దశకు చేరుకున్న అమ్మకాలు

అందుబాటులో తాజా ఆకు కూరలు



బంక్ జంక్షన్‌లో తాజా ఆకు కూరలు దొరుకుతాయనే నమ్మకం అందరిలో కలిగింది. దీంతో చాలా మంది వ్యాపారులు, హోటల్ యజమానుల ఇక్కడికి వచ్చి కేవలం ఆకు కూరలు కొనుగోలు చేస్తుంటారు. ఐదారు గంటల్లో రూ.4 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. దీనికి కారణం ఇక్కడ దొరుకుతున్న ఆకుకూరల్లో నాణ్యతే కారణం.

– సీహెచ్ కుమార్, వ్యాపారి

కూరలు బాగుంటాయి



నేను కొన్ని పంటలు పండిస్తాను. నా వద్ద లేని కూరలు ఇక్కడకు వచ్చి కొంటాను. వీటిని నేను రిటైల్‌గా అమ్మకాలు చేస్తాను. నా పొలంలో ఎంత నాణ్యత ఉంటుందో ఇక్కడ ఆకు కూరలు కూడా అంతే నాణ్యతగా ఉంటాయి. ఉదయం రెండు గంటలకు వస్తాను. ఆకు కూరలు కొనుగోలు చేసి వెళ్లిపోతాను. ఇలా నగరం నలు మూలల నుంచి ఎంతో మంది వస్తుంటారు. కనబడని వ్యాపారం జరుగుతుంది.

–కె.ఈశ్వరరావు పెందుర్తి



ఆకు కూరలను తరలిస్తున్న ఆటో

రూ. 4లక్షల వ్యాపారం

సుమారు 5 గంటల్లో రూ.4 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడ కేవడం ఆకు కూరలు మాత్రమే విక్రయిస్తారు. హోటల్స్ నిర్వాహకులతో పాటు, వ్యాపారులు, హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారస్తులు, వీధుల్లో అమ్మకునే రిటైల్ వ్యాపారస్తులు, ఇలా పలు రకాల వినియోగదారులు ఇక్కడే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. రైతు బజార్లలో అమ్మకాలు చేసే కొందరు రైతులు తమవద్ద లేని కొన్ని ఆకు కూరలు ఇక్కడే కొనుగోలు చేస్తారు. గోంగూర, తోటకూర, కొత్తిమీర, పుదీన, కరివేపాకు, పాలకూర, చుక్కకూర, ముల్లంగి వంటి అన్నిరకాల ఆకు కూరలు అందుబాటులో ఉంటాయి. కొనుగోలు దారులు వ్యానులు.. ఆటోల్లో ఆకు కూరల్ని తరలించుకు పోతుంటారు. ఈ సెంటర్ ఎంతో మందికి ఉపాధి కేంద్రంగా మారింది.

గౌరీనగర్‌లో పర్యటించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ ప్రాంతంలో సోమవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై స్థానికుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఆయా ప్రాంతాలను పారిశుద్ధ్య అధికారులతో కలసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఉచిత ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తమ పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: ఉపాధి,స్వయం ఉపాధి అంశాల్లో సంస్థలు అందించే శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మరియు హోం ట్రయాంగిల్ సంస్థ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేజ్ -1 (వడ్రంగి,ప్లంబింగ్,విద్యుత్, గృహోపకరణాల రిపేరింగ్) వంటి వాటిలో యాప్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా కార్పెంటర్ వర్క్,ప్లంబింగ్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్,బ్యూటీషియన్ వంటి వాటిలో శిక్షణ ఉంటుందన్నారు. వీటిలో నైపుణ్యం సాధిస్తే ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ రాము,ఏపీడీ కృపానంద్, నాయకులు అంగ దుర్గాప్రశాంతి, పాలమేర శ్రీను,కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో కాలువ మరమ్మతులు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ప్రధాన కాలువ మరమ్మతు పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. అంబేడ్కర్ కాలనీలో ప్రధానకాలువ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు దృష్టికి తీసుకు వెళ్లారు.

వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రెయిన్ మరమ్మతులకు అంచనా విలువ వేయించి టెండర్ పంపించారు. ఈ మేరకు రూ.14 లక్షలు మంజూరు కావడంతో సోమవారం కార్పొరేటర్ లక్ష్మణరావు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దాడ ప్రసాద్, రామకృష్ణ, రావాడ అప్పారావు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేయాలని వినతి



తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అప్పారావు తదితరులు

విశాఖ విద్య: ఎన్ఏడీ జంక్షన్ దరి నేతాజీ నగర్‌లో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మళ్ల అప్పారావు కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. 1990లో నేతాజీ నగర్‌కు చెందిన 70 కుటుంబాల వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని.. ఇంత వరకూ వాటి రెగ్యులరైజ్ చేయకపోవటంతో ఎటువంటి హక్కులు పొందలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ కారణంగా ఏదైనా అవసరాలకు ఉపయోగించుకోలేక, ఇంటి యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇళ్ల పట్టాలను రెగ్యులరైజ్ చేసేందుకు చొరవ తీసకోవాలని తహసీల్దార్‌ను కొరారు. కార్యక్రమంలో మర్రిపాలెం గ్రీన్ బెల్ట్‌వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



ఏఈ వెంకలక్ష్మికి సూచనలు ఇస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వార్డు పరిధిలోని సుసర్ల కాలనీ పార్వతీ చంద్ర మౌళీశ్వర ఆలయం నుంచి పేస్టరీ చెఫ్ వైపు సీసీ డ్రైన్ నిర్మాణ పనులను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. రూ. 19.93 లక్షల జీవీఎంసీ అభివృద్ధి నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం వార్డు పరిధిలోని సీతారామరాజునగర్ పార్క్‌లో సుందరీకరణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీను, సోమేష్, దాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు ప్రారంభం



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో సోమవారం పశు వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు పశు వైద్యశాల పరిధిలో ఉన్న వివిధ వార్డుల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. పాడి రైతులు పశువులకు జబ్బులు, వాపులు, గొంతువాపులు, చూడు నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. డాక్టర్ సునీల్‌కుమార్ పశువులను పరీక్షించి వివిధ రకాలు మందులును పంపిణీ చేశారు. పాడిరైతులు సియాద్రి రమణ, తిరమరెడ్డి అప్పారావు, గంట అబ్బినాయుడు, బొందల రమణమ్మ, కిల్లి సూరిలక్ష్మి, ఇజ్జి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగండి
- హోంమంత్రి అనిత
- గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ సందర్శన



పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత

గోపాలపట్నం: స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగడంతో పాటు గంజాయిపై ఉక్కు పాదం మోపాలని రాష్ట్రహోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఆ సమయంలో విద్యుత్ లేక పోవడంతో కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు. సెల్‌ఫోన్ల వెలుతురులో రిజిస్టర్, రౌడీషీటర్ల వివరాలను పరిశీలించారు. విద్యుత్ ఎంతకీ రాకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ఐఆర్‌లు ఎప్పటికప్పుడు వేసి ఫిర్యాదు దారులకు ఆ కాపీలు ఇవ్వాలని సూచించారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌పై సింహాచలం దేవస్థానానికి వచ్చే వీఐపీల తాకిడి వల్ల భారం ఉంటుందని.. గతంలో కూడా వేపగుంటలో పోలీస్ స్టేషన్ ప్రపోజల్ ఉందని తెలిపారు. దాని ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే పెందుర్తి పోలీసులు నరవ వెళ్లేందుకు ఎక్కువ దూరం అవుతుందని నరవ ఏరియాను గోపాలపట్నం స్టేషన్‌లోకి చేర్చడం వంటి అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. సింహాచలం దేవస్థానం కొండపై అవుట్ పోస్టు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ మంత్రితో మాట్లాడామని తెలిపారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ స్థానంలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు స్థల పరిశీలన చేస్తున్నామని చెప్పారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి సమాలోచనలు చేస్తున్నామని త్వరలోనే ఆ సమస్యకు చెక్ పడుతుందన్నారు. ఆమె వెంట ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐలు సీహెచ్ రామారావు,ట్రాఫిక్ ఎస్ఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలు పరిష్కరించండి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంకల కవిత నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేయాలని, వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ఆంధ్ర రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ నాయకులు జి.అప్పలరాజు, గౌరీష్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా అని విమర్శించారు. ఇది కూడా ప్రైవేటీకరణలో ఒక భాగమే అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేయడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు కర్మాగారం కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తోందన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన
డీసీపీ-2 మేరీ ప్రశాంతి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ - 2 మేరీ ప్రశాంతి

మర్రిపాలెం : గత ఏడాది నవంబర్ 29న ఊర్వశి జంక్షన్ దరి ఐటీఐ కూడలి వద్ద ఆర్టీసీ బస్సులో మహిళపై దాడికి పాల్పడింది ఓ యాచకుడని, అలాగే అతడు ఉపయోగించింది యాసిడ్ కాదని బాత్రూమ్‌లు శుభ్రపరిచే (తక్కువ మోతాదులో ఉన్న కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్) రసాయనమని డీసీపీ – 2 మేరీ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఐటీఐ జంక్షన్ వద్ద గోపాలపట్నం నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఓ యాచకుడు బస్సు దిగి బయట నుంచి మహిళపై యాసిడ్ పోసి వెళ్లిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందిందని తెలిపారు.

మహిళ వెనుక ఉన్న వారిపై కూడా ఆ ద్రావకం చుక్కలు పడినట్టు ఆమె వెల్లడించారు. అయితే అప్పుడు యాసిడ్ దాడి జరిగినట్టు బాధితులు చెప్పడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పందించి విచారణకు ఆదేశించారని, మొత్తం 21 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామని తెలిపారు. యాసిడ్ దాడి జరిగినట్టు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అన్ని విధాలుగా విచారించామని, నిందితుడికి, బాధితులకి మధ్య కక్షలు, గొడవలు ఉన్నట్టు కనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించామని, సదరు యాచకుడు గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వెంకట శ్రీనివాస్‌గా గర్తించామని తెలిపారు. సదరు యాచకుడు తరచూ 28వ నంబర్ ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుంటాడని, ఈ క్రమంలో టికెట్ తీసేందుకు నిరాకరిస్తుంటాడని... ఆ క్రమంలోనే బస్సు కండక్టర్, డ్రైవర్ మీద కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోసేందుకు ప్రయత్నిస్తే... అది మహిళపై పడినట్టు అంచనా వేసినట్టు ఆమె తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎస్ఐలు సమీర్, దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.